

పార్టీ అండగా ఉంటుంది

చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా



గాజువాక 65వ వార్డులో రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

- మృతుల కుటుంబాలకు పరామర్శ
- కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు పార్టీ అభివృద్ధికి శ్రమిస్తున్న వారందరికీ తోడునీడగా ఉంటామని ప్రకటన
- నగరంలో 'నిజం గెలవాలి' యాత్ర



దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న కుటుంబానికి రూ.3 లక్షల చెక్ అందజేస్తున్న నారా భువనేశ్వరి

విశాఖపట్నం/జ్ఞానాపురం/అక్కయ్యపాలెం, గాజువాక, అక్కిరెడ్డిపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

"మీ నాయకుడు చంద్రబాబునాయుడు నన్ను పంపించారు. మీకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందుతాయి. పార్టీ అండగా ఉంటుంది. ఆందోళన చెందొద్దు, ధైర్యంగా ఉండండి"

- ఇదీ చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి ఇచ్చిన భరోసా

'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా ఆమె శుక్రవారం నగరంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన జాగారాపు చిన్న ఇంటికి వెళ్లారు. చిన్న భార్య గౌరిని, పిల్లలు దేవి, కిరణ్‌కుమార్, నందినిని భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరి మాట్లాడుతూ తన భర్త నందమూరి తారకరామారావుపై అభిమానంతో పార్టీలో పనిచేసేవారన్నారు. చంద్రబాబునాయుడు జైలుపాలు కావడాన్ని తట్టుకోలేక మృతిచెందారని కన్నీటి పర్యంతమవ్వగా... భువనేశ్వరి ఓదార్చారు. చదువు పూర్తిచేసిన తన




జ్ఞానాపురంలోని టీడీపీ కార్యకర్త మలిశెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ప్రజలకు నమస్కరిస్తున్న నారా భువనేశ్వరి

కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని కోరగా ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చిన్న కుటుంబానికి భువనేశ్వరి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. తరువాత జ్ఞానాపురం వెళ్లి మలిశెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించారు. రమణ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబానికి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రమణ కుమారుడు, 41వ వార్డులో 17వ బూత్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తన తండ్రి రమణ...ఎన్టీఆర్ అభిమానిగా ఉండేవారని, తరువాత పార్టీలో చేరి చివరి వరకూ పనిచేశారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేకపోయారని, బెయిల్ విషయంలో జాప్యం జరగడంతో మరింత మనస్తాపానికి గురై చనిపోయారన్నారు. భువనేశ్వరి స్పందిస్తూ అధైర్యపడొద్దని, అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆ తరువాత భువనేశ్వరి విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్లపాలెంలో పంచిరెడ్డి కనకారావు ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కనకారావు సతీమణి పార్వతి, కుమారుడు శ్యామ్, కుమార్తె ఉదయశ్రీలకు ధైర్యం చెబుతూ రూ.మూడు లక్షల చెక్ అందజేశారు. వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ అయిన తన భర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, చంద్రబాబును జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక చనిపోయారని కనకారావు సతీమణి పార్వతి భోరుమన్నారు. ఇంజనీరింగ్ చేసిన తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరగా ... మిగతా 6వ పేజీలో

ఖాళీ అవుతున్న స్టీల్‌ప్లాంట్

భారీగా తగ్గుతున్న ఉద్యోగుల సంఖ్య



- ఏళ్లుగా పదవీ విరమణలే... నియామకాల్లేవ్
- అనేక విభాగాల్లో ఉద్యోగులు, కార్మికుల కొరత
- వచ్చే ఏడాదిలో 1,084 మంది ఉద్యోగ విరమణ
- ప్లాంటు ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్రత్యామ్నాయం చూసుకుంటున్న పలువురు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5:

రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య దారుణంగా పడిపోతోంది. ఓ పక్క ఉద్యోగ విరమణలు, మరోపక్క ప్లాంటు ప్రైవేటీకరణ ప్రకటన నేపథ్యంలో కొంతమంది ప్రత్యామ్నాయం వెతుక్కుని రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. రానున్న కాలంలో మరిన్ని ఖాళీలు ఏర్పడతాయని కార్మిక నాయకులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ కొత్తగా ఉద్యోగాల భర్తీపై యాజమాన్యం స్పందించడం లేదు. ఫలితంగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై అధిక భారం పడుతోంది.

విశాఖలో స్టీల్‌ప్లాంటును తొలినాళ్లలో మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతో పనిచేసేలా నిర్మించారు. అప్పటి అవసరాలను బట్టి సుమారు 12 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. ఆ తరువాత ప్లాంటు విస్తరణ, ఆధునీకరణ పనులు చేపట్టడంతో ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరింది. ఇందుకు అవసరమైన ఉద్యోగులు, సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉన్న వారితోనే ఏళ్లుగా నెట్టుకొచ్చారు. మరోవైపు ఏటా ఉద్యోగ విరమణలతో ఖాళీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కొత్త నియామకాలు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పని భారం పడుతోంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో దాదాపు 90 శాతం మంది 2026 నాటికి ఉద్యోగ విరమణ చేయనున్నారు. అయినప్పటికీ యాజమాన్యంలో కనీస స్పందన లేదు. ప్లాంటులో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి గతంలో ... మిగతా 6వ పేజీలో

2024లో నెల వారీగా ఉద్యోగ విరమణలు

నెల	అధికారులు	కార్మికులు	మొత్తం
జనవరి	28	41	69
ఫిబ్రవరి	17	29	46
మార్చి	24	53	77
ఏప్రియల్	23	77	100
మే	62	86	148
జూన్	73	123	196
జులై	48	74	122
ఆగస్టు	38	55	93
సెప్టెంబరు (అత్యల్పం)	21	23	44
అక్టోబరు	24	27	51
నవంబరు	17	44	61
డిసెంబరు	23	54	77
మొత్తం	398	686	1084

రేపే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- టీపీటీ కాలనీలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహణ
- ఉదయం 10 గంటలకు ప్రారంభం

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏటా మాదిరిగా 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై



ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు...రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని సీతమ్మధార టీపీటీ కాలనీలో గల శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో జరగనున్నాయి. స్థానికంగా 'సీఎంఆర్' స్పాన్సర్ చేస్తోంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు ఇవ్వనున్నారు. ఇకపోతే, పోటీలో మహిళలు మాత్రమే పోటీల్లో పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. రెండు గంటల్లోగా ముగ్గు వేయాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. పోటీల్లో పాల్గొనదలచినవారు మరిన్ని వివరాలకు ఈ 9985411659, 9492452283 నంబర్లకు సంప్రతించాలి. ఉదయం 9 గంటలకల్లా ప్రాంగణానికి చేరుకోవాలి. కచ్చితంగా పది గంటలకు పోటీ ప్రారంభమవుతుంది.

అంగన్‌వాడీల భిక్షాటన



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన రహదారిపై భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

సిరిపురం, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు వై. తులసి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడు దల చేసిన ప్రకటనలో కనీస వేతనాలను రూ. 26 వేలకు పెంచలేదన్నారు. సమ్మె కార్మికుల హక్కు అని సమస్యలను పరి ష్కరించడం కుదరక అంగన్‌వాడీలను నిర్బంధించడం సరికాదన్నారు. సర్వశిక్ష అభియాన్‌తో పాటు మూడు లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'రాంకీ' ఫార్మా కమర్షియల్ హబ్‌ను సందర్శించిన పంజాబ్ సీఎం



- పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి

రాంకీ ఫార్మా హబ్‌లో కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన పంజాబ్ సీఎం భగవంత్‌మన్

పరవాడ, జనవరి 5: తమ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని 'రాంకీ ఫార్మా' ప్రతినిధులను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మన్ కోరారు. శుక్రవారం ఆయన అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల రాంకీ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌ను సందర్శించారు. అనంతరం రాంకీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. తమ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకే అనువైన ప్రదేశాలు ఉన్నాయని, పారిశ్రామికవేత్తలు తరలివచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం తమ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిని పంపిస్తామని, ఆయనతో అన్ని విషయాలు చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా ఫార్మా సిటీ ఎండీ లాల్‌కృష్ణ...రాంకీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, రాంకీ ప్రతినిధులు రాఘవరెడ్డి, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత పంజాబ్ సీఎంకు స్థానిక శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఘన స్వాగతం పలికారు.

కేజీహెచ్‌లో స్వీపర్ అరాచకం

- నిద్రపోతున్న రోగి సహాయకురాలిపై మద్యం మత్తులో దాడి

మహారాణిపేట (విశాఖపట్నం), జనవరి 5: కేజీహెచ్‌లో స్వీపర్ మద్యం మత్తులో రోగి వెంట సహాయకురాలిగా వచ్చిన మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెనుక భాగంలో కొరికాడు. ఆస్పత్రిలోని భవనగర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగికి సహాయంగా ఉండేందుకు కుటుంబ సభ్యురాలు వచ్చారు. గురువారం రాత్రి ఆమె ... మిగతా 6వ పేజీలో

పూజారికి సమర్పయామి

అక్కడ దేవుడి కంటే అర్చకునికే ఆదాయం ఎక్కువ

- ఇదీ బెల్లం వినాయకుడి గుడిగా ప్రాచుర్యం పొందిన శ్రీబుచ్చి రామలింగేశ్వర దేవస్థానంలో పరిస్థితి
- దేవదాయ శాఖ పరిధిలో దేవస్థానం
- వార్షిక ఆదాయం రూ.4.5 లక్షలే
- పూజారికి మాత్రం బెల్లం రూపేణా అంతకు పదింతలు?
- అర్చక, వంశపారంపర్య హక్కుల కోసం కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు



భక్తులు బెల్లం సమర్పిస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అక్కడ దేవుడి కంటే పూజారి సంపాదనే అధికం. అదేంటి... హుండీలో భక్తులు వేసే కానుకలన్నీ దేవుడికే చెందుతాయి కదా?... అనే సందేహం రావచ్చు. కానీ...వన్‌టౌన్ ప్రాంతంలో బెల్లం వినాయకుడి గుడిగా ప్రాచుర్యం పొందిన శ్రీబుచ్చి రామలింగేశ్వర దేవస్థానంలో భక్తులు హుండీల్లో చిల్లర వేసి, మొక్కుగా 'భారీమొత్తంలో బెల్లం' సమర్పించుకుంటుంటారు. అదంతా తనదేనంటూ పూజారి తీసుకుని, వ్యాపారులకు అమ్ముకుంటుంటారు. అందుకే అక్కడ అర్చకత్వం కోసం పూజారులు కోర్టుల వరకూ వెళుతున్నారు. దేవదాయ శాఖ లెక్కల ప్రకారం ఈ ఆలయం వార్షికాదాయం రూ.4.5 లక్షలే. అయితే పూజారి ఆదాయం అంతకు పదింతలు ఉంటుందంటున్నారు.



ఆలయంలో గణపతి విగ్రహం

బెల్లం వినాయకుడి గుడి కేజీహెచ్ పక్కనున్న రెల్లివీధి, ఆఫీషియల్ కాలనీల మధ్య ఉంటుంది. వాస్తవానికి ఇది శివాలయం. అసలు పేరు.. శ్రీ బుచ్చి రామలింగేశ్వర దేవస్థానం. ఇక్కడ ప్రధానంగా శివుడిని కొలవాలి. దాంతో పాటు వినాయక పూజలు సాధారణం. కానీ అక్కడి పూజారి వాక్చాతుర్యం వల్ల శివుడి కంటే గణపతికే ఎక్కువ పేరు వచ్చింది. ఇక్కడి వినాయకుడి వద్దకు వచ్చి...మొక్కుగా బెల్లం సమర్పిస్తామని వేడుకుంటే ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీకి 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డు?

- ఈ నెల 11న ఫలితాల విడుదల, అవార్డుల ప్రదానం

విశాఖపట్నం, జనవరి 5: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీలో గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పలు విభాగాల్లో అవార్డులు దక్కించుకోనున్నదని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు శుక్రవారం అమరావతిలో వెల్లడించారు. ఈ నెల 11న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాలను విడుదల చేయడంతో పాటు అవార్డులను అందజేయనున్నారు.దీనికి హాజరు కావాలంటూ జీవీఎంసీ అధికారులకు ఇప్పటికే ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశుధ్య సర్వేలో అత్యుత్తమ నగరాలుగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగర పాలక సంస్థలు అవార్డులకు ఎంపికైనట్టు చంద్రుడు తెలిపారు. జీవీఎంసీ బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్‌సిటీ కేటగిరిలో అవార్డు సాధించిందన్నారు. నగరంలో పారిశుధ్య నిర్వాహణ పట్ల మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మలు నిరంతరం సలహాలు ఇస్తుండడం వల్లే ఈ ఘనతను దక్కించుకున్నామని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు అన్నారు.


తొలగించనున్న ఇటీవల లక్షలతో నిర్మించిన టాయిలెట్‌లు


సచివాలయ భవనం కూల్చివేత

బాగున్న భవనాలనూ.. కూల్చేస్తున్నారు..!

- 41వ వార్డులో సచివాలయాల కూల్చివేత
- గతంలో ఉన్న కల్యాణమండపం పునరుద్ధరణ పేరిట పనులు
- ప్రజాధనం దుర్వినియోగంపై స్థానికుల ఆగ్రహం

జ్ఞానాపురం, జనవరి 5: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఇంజనీరింగ్ అధికారులు తీరుతో ప్రజాధనం వృథాగా అవుతోంది. అవసరం ఉన్నచోట సౌకర్యాలు కల్పించకుండా ఉపయోగంలేని చోట్ల పనులతో జీవీఎంసీకి లక్షలాది రూపాయల నష్టం చేకూరుతోంది. ఈ కోవలో 41వ వార్డు పరిధి జ్ఞానాపురంలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఇక్కడి జోనల్ కార్యాలయానికి ఆనుకుని మరియదాసు కల్యాణ మండపం ఉంది. దీనిని స్థానికులు సామాజిక అవసరాలకోసం వినియోగించేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సామాజిక భవనాన్ని సచివాలయాలుగా మార్చారు. ఆ ప్రాంతంలో ఉన్న టాయిలెట్లను మాత్రం సరిదిద్దలేదు. ఈనేపథ్యంలో అనేక విజ్ఞాపనల మేరకు 2022లో రూ. 2 లక్షల వ్యయంతో వీటికి మరమ్మతులు చేశారు. కొత్తగా పలకలువేసి, టాయిలెట్ సామ గ్రితో తీర్చిదిద్దారు. నీటి సరఫరాలేక వీటిని ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు. ఇప్పుడు మళ్లీ సచివాలయాలు తరలించి సామాజిక భవ నం నిర్మిస్తామంటూ ఈ భవనాలు తొలగిస్తున్నారు. వాటిలో భాగంగా మరమ్మతులు చేపట్టిన టాయిలెట్లనూ పగులగొడుతున్నారు. ఎప్పటి నుంచో సామాజిక భవనం ప్రతిపాదన ఉన్న ఈ ప్రాంతంలో ఎలా ప్రజాధనం దుర్వినియోగం చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ జోనల్ కార్యాలయంలో ప్రజలు కానీ, కార్యాలయ సిబ్బంది కానీ వినియోగించేందుకు వీలుగా మా త్రం టాయిలెట్లు ఇంజనీరింగ్ అధికారులు నిర్మించలేదని వాదన స్థానికులనుంచి వినిపిస్తోంది.

మూలకుచేరిన పీపీఈ కిట్లు

వీటితోపాటు కొవిడ్ సమయంలో జోన్‌కు అందించిన వేలాది పీపీఈ కిట్లు, ఆసుపత్రి సామగ్రి ఈ సచివాలయ భవనంలో ఉన్నాయి.ప్రస్తుతం పర్యవేక్షణలేక పాడైపోతున్నాయి. మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో ఈ కిట్లను అధికారులు భద్రపరచకుండా వదిలేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.


సచివాలయం ఆవరణలో వృథాగా వదిలేసిన పీపీఈ కిట్లు

కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎదగాలి

- కాపునాడు కన్వీనర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న కాపునాడు కన్వీనర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, జనవరి 5: కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎగదాల్సిన అవసరం ఉందని కాపునాడు రాష్ట్ర కన్వీనర్ గిద్దా శ్రీనివాసనాయుడు తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు రాజ్యాధికారం, భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న విజయవాడ గాంధీనగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో విశాఖలో ఆరు ఎమ్మెల్యేలు, ఎంపీ సీటు కాపులకు కేటాయించాలని తెలిపారు. విశాఖపట్నం కన్వీనర్ తలారి సురేష్ , జిల్లా మహిళా కన్వీనర్ మంగతాయారు, సీతారాం, ఎం.సురేశ్, ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

హార్బర్ ట్రాఫిక్ సీఐగా షణ్ముఖరావు

మహారాణిపేట, జనవరి 5: హార్బర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గాఎస్. షణ్ముఖరావును నియమించారు. ఇక్కడ పని చేసిన జీఆర్‌కే తులసీదాస్‌ను వీఆర్‌కు సరెండరు చేశారు.

'ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి'

కంచరపాలెం, జనవరి 5: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సమ గ్ర శిశ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ ఎదుట గాంధీ వి గ్రహం ఎదుట నిరసన కొనసాగించారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు

భువనేశ్వరితో టీడీపీ నాయకుల భేటీ


భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి నాయకులు

మహారాణిపేట, జనవరి 5: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరీతో శుక్రవారం పలువురు పార్టీ నాయకులు సమావేశమయ్యారు. నిజం గెలవాలి కార్యక్రమం కోసం విశాఖ వచ్చిన ఆమెతో హోటల్ నోవాటేల్ లో పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ డీరామారావు, బుద్దా వెంకన్న, ఇన్‌చార్జిలు కోరాడ రాజబాబు, గండిబాబ్జీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్‌నజీర్ పాల్గొన్నారు.

'నారా' కుటుంబ నిబద్ధతకు నిదర్శనం' : జనసేన

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి లోనై మృతి చెందిన కుటుంబాలను పరామర్శకు ఆయన సతీమణి భువనేశ్వరి రావడం.. నారా కు టుంబం నిబద్ధతకునిదర్శనమని జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో నారాభువనేశ్వరినినేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వం ఏర్పాటుచారిత్రాత్మక అవసరమన్నారు. వైసీపీపాలనపై ప్రజలు విసిగి పోయారన్నారు.

పార్టీ అండగా ఉంటుంది

... 5వ పేజీ తరువాయి

టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూస్తామని హామీ ఇచ్చారు. మురళీనగర్‌లో భోజనం చేసిన అనంతరం గాజువాక వెళ్లారు. బీసీ రోడ్డుకు చెందిన కోరుకొండ వెంకటరమణ, భానోజీ కాలనీ ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి సరోజినీదేవి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తుందని, మీ కుటుంబాలకు మరింత చేయూతనిచ్చి తోడునీడగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి (టీడీపీ బాబాయి) కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన భార్య పార్వతి దేవి, కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, సుధాకర్‌లను పరామర్శించిన ఆమె అండగా తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు టీడీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తాము అన్ని వేళలా అండగా నిలుస్తామన్నారు. రాధాకృష్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. ఇదిలావుండగా పాతగాజువాకలో నారా భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నజీర్, చిక్కాల విజయ్, అనంతలక్ష్మి, కార్పొరేటర్‌లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, నాయకులు నల్లారు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఖాళీ అవుతున్న స్టీల్‌ప్లాంట్

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ఆ ఖాళీలను ఇప్పటివరకు భర్తీ చేయలేదు.

ప్రైవేటీకరణ ప్రకటనతో ఆందోళన

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తైతే తమ ఉద్యోగాలు పోతాయోమోననే ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. దీంతో సమస్య మరింత జఠిలమవుతోంది. పైగా వచ్చే ఏడాది ఏకంగా 1084 మంది ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఇప్పటికే అధిక పనిభారంతో పనిచేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఉద్యోగాల నియామక ప్రక్రియను యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ప్లాంట్‌పై తీవ్రస్థాయిలో కుట్ర జరుగుతోందనే అనుమానం అటు ఉద్యోగులు, ఇటు కార్మికుల్లో నెలకొంది.

కొత్త నియామకాలు చేపట్టాలి

స్టీల్‌ప్లాంటులో తక్షణమే నియామకాలు చేపట్టాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని, ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు కూడా అందజేశాం. ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యానికి అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య ఉండాలి. ఆ దిశగా యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలి.

\- కేఎస్‌ఎన్ రావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు

పూజారికి సమర్పయామి

... 5వ పేజీ తరువాయి

కోర్కెలు తీరుతాయని ఇటీవల కాలంలో బాగా ప్రచారం జరుగుతోంది. దాంతో భక్తులు బెల్లం దిమ్మలను తీసుకువచ్చి వినాయకుడికి సమర్పిస్తుంటారు. దీంతో 'బెల్లం వినాయకుడి'గా ప్రసిద్ధికెక్కారు.

హక్కుల కోసం పోరాటాలు

రెండు దశాబ్దాల క్రితం ఈ ఆలయానికి భక్తులు పెద్దగా వెళ్లేవారు కాదు. దసపల్లా హోటల్ వద్ద గల శివాలయం పూజారులే దానికి అర్చకులుగా ఉండేవారు. వారు ఎక్కువ సమయం దసపల్లా హోటల్ వద్ద గల శివాలయంలో ఉండడం వల్ల రామలింగేశ్వర దేవస్థానంలో పెద్దగా పూజాదికాలు జరిగేవి కావు. ఈ నేపథ్యంలో వారం కొంతకాలం క్రితం పద్మనాభశర్మ అనే పూజారిని రామలింగేశ్వర దేవస్థానానికి పంపించారు. ఆయన వచ్చిన తరువాత శివుడి కంటే వినాయకుడిపైనే ఎక్కువ దృష్టి పెట్టి..బెల్లం సమర్పిస్తే కోర్కెలు తీరతాయంటూ ప్రత్యేక పూజలు చేయడం ప్రారంభించారు. అలా అది ప్రాచుర్యంలోకి వచ్చింది. భక్తులు తెచ్చిన బెల్లాన్ని ఆయన విక్రయించుకుంటూ, ధనిక భక్తులతో పెద్ద పెద్ద పూజలు, హోమాలు చేయిస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. దాంతో ఆ ఆలయాన్ని మళ్లీ తమకే ఇచ్చేయాలని దసపల్లా పూజారులు గొడవకు దిగారు. తాను అభివృద్ధి చేసినందున తనకే హక్కులు ఉన్నాయని పద్మనాభశర్మ వాదించడం ప్రారంభించారు.

బెల్లం వేలంపై స్టే

ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోనే ఉంది. ఆ లెక్కన దేవుడికి వచ్చే కానుకలన్నీ ప్రభుత్వానికే చెందాలి. కానీ ఇక్కడ పూజారి బెల్లాన్ని తీసుకుని విక్రయంచుకొని లాభపడుతుండడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో రెండేళ్ల క్రితం అప్పటి అసిస్టెంట్ కమిషనర్ శాంతి ఆలయానికి ప్రత్యేకంగా ఈఓను నియమించి, లెక్కలు రాయించడం మొదలపెట్టారు. ఆ తరువాత బెల్లాన్ని వేలం వేయడానికి యత్నించారు. పత్రికా ప్రకటన ఇచ్చారు. దాంతో ఆలయ పూజారి హైకోర్టును ఆశ్రయించారు. భక్తులు స్వామికి ప్రసాదంగా ఇచ్చే బెల్లాన్ని వేలం వేయడం తగదని విన్నవించుకోవడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. దాంతో వేలం ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ యధాప్రకారం అర్చకులే బెల్లాన్ని తీసుకుంటున్నారు.

హక్కులపై ట్రిబ్యునల్‌కు

దసపల్లా శివాలయం పూజారులు బెల్లం వినాయకుడి గుడి అర్చకులుగా తామే ఉన్నామని, అది తమకే చెందాలని ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. అయితే దేవదాయ శాఖ రిజిస్టర్ నంబరు 38లో పూజారులుగా దసపల్లా శివాలయంలో పనిచేస్తున్న వారి పేర్లు ఉన్నప్పటికీ, ఆ తరువాత అమలులోకి వచ్చిన మరో రిజిస్టర్ 43లో కొత్త పూజారి పద్మనాభశర్మ, శ్రీకాంత్‌శర్మలు పేర్లు ఉండడంతో వారే కొనసాగాలని ట్రిబ్యునల్ స్పష్టంచేసింది. దీనిపై వారు మరో అప్పీల్ చేయాలని భావిస్తున్న సమయంలో ఆ కుటుంబ పెద్ద మరణించారు. దాంతో అక్కడ ఆగింది.

రూ.5 లక్షల లోపు ఆదాయం అంటూ హక్కులకు యత్నం

ఇటీవల సుప్రీంకోర్టు ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను దేవదాయ శాఖ పరిధి నుంచి తప్పించి, ట్రస్టీలకు, వంశపారంపర్య అర్చకులకు అప్పగించాలని ఆదేశించింది. ఆ నిబంధనల ప్రకారం గుడిని దేవదాయ శాఖ నుంచి తప్పించి తమకు అప్పగించాలని పూజారి శ్రీకాంత్‌శర్మ దరఖాస్తు చేసుకున్నారు. అయితే అది రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయం అయినప్పటికీ దాని బాధ్యతలు తీసుకోవడానికి దరఖాస్తు చేసిన అర్చకులు వంశ పారంపర్యంగా వచ్చినవారు కాదు కాబట్టి వారికి ఇవ్వలేమని జిల్లా అధికారులు తేల్చి చెప్పి దరఖాస్తును తిరస్కరించారు. ప్రస్తుతం ఆలయం దేవదాయ శాఖ పరిధిలోనే ఉంది. కానీ ప్రధాన ఆదాయం బెల్లం మాత్రం అర్చకులకే వెళుతోంది. ఇంకా పూర్తిస్థాయి హక్కుల కోసం అన్ని వర్గాలు ప్రయత్నం చేస్తున్నాయి.

కేజీహెచ్‌లో స్వీపర్ అరాచకం

... 5వ పేజీ తరువాయి

నిద్రిస్తుండగా ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న ధనాల వాసు మద్యం మత్తులో వెనుక నుంచి గట్టిగా కొరికాడు. దీంతో ఆమె ఉలిక్కిపడి లేచి కేకలు వేసింది. శరీరంపై పంటి గాట్లు పడడంతో సిబ్బంది వెంటనే చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

నేటి నుంచి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ తమ్మిరెడ్డి

సీతమ్మధార, జనవరి 5: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలను శనివారంనుంచి నిర్వహిస్తున్నట్టు ఆంధ్రయూనివర్సిటీ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ మధుకుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా క్యాంపస్‌లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం 46వ వార్షిక సమావేశాన్ని, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చారిత్రక కథనాల పరిశోధనకు ఈవెంట్ వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఏపీహెచ్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కె.మూర్తి, ప్రొఫెసర్ ఎస్.మురళి మోహన్, బి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ప్రతినిధులు సందర్శన


మాట్లాడుతున్న ప్రొఫెసర్ తమ్మిరెడ్డి

మురళీనగర్, జనవరి 5 ; మురళీనగర్ బాలభాను ప్రైవేట్ పాఠశాలను శుక్రవారం విదేశీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఏటా తమ పాఠశాలకు ప్రతినిధులు విచ్చేస్తుంటారని, ఇందులో భాగంగా ఈసారి వచ్చినట్టు పాఠశాల ప్రిన్సిపల్ శుభశ్రీ తెలిపారు. స్పెయిన్, స్విట్జర్లాండ్, అమెరికా దేశాలనుంచి విచ్చేసిన ప్రతినిధులు చిన్నారులతో ముచ్చటించారు. వారి విద్యా బోధన, ప్రగతి తదితర అంశాలను అడిగి తెలుసుకు న్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి..

అక్కయ్యపాలెం: హెచ్‌టీ లైన్స్‌కు నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. మహారాణి పార్లర్ ఏరియా, జీవీ ఎంసీ జడ్పీ పాఠశాల ఏరియా, చిన్నూరు, జగ్గారావు బ్రిడ్జి ఏరియాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

3937 మందికి ద్వై వార్షిక సంక్షేమ ఫలాలు: కలెక్టర్


లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్

మహారాణి పేట, జనవరి 5: ద్వైవార్షిక సంక్షేమ నిధులు మంజూరులో బాగంగా జిల్లా వ్యాప్తంగా 3937 మంది రూ. 5, 58, 26, 443 కోట్ల లబ్ధి పొందినట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపా రు. అర్హత ఉన్నా, సాంకేతిక సమస్యలతో లబ్ధిపొందని వారికి మరోసారి అవకాశం కల్పిస్తు ముఖ్య మంత్రి జగన్‌మోహనరెడ్డి ఈ నిధులు మంజూరు చేశారన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నా రు.ఈబీసీ నేస్తాం, అమ్మఒడి, చేదోడు పథకం,వైయస్ఆర్, కళ్యాణమస్తు షాదీ తోఫా, కాపునేస్తం, మత్స్యకార భరోసా వాహన మిత్ర తదితర పథకాల్లో పలువురు లబ్ధి పొందారన్నారు.

'బాధిత కుటుంబాన్ని ఆదుకోరూ..'

అక్కయ్యపాలెం, జనవరి 5: టీడీపీ అధినే నారా చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సంఘటనలతో మనస్తాపంతో మృతి చెందిన 55వ వార్డు పార్టీ బూత్ కన్వీనర్ మీసాల వాసుదేవరావు కుటుంబ సభ్యులకు పార్టీ తరపున న్యాయం చేసి ఆదుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, వార్డు ప్రధాన కార్యదర్శి మీసాల సూరి అప్పలనాయుడు చం ద్రబాబు సతీమణి భువనేశ్వరిని కోరారు. తాటిచెట్లపాలెం రామచంద్రానగర్‌కు శుక్రవారం విచ్చేసిన ఆమెకు వినతి పత్రం సమర్పించారు. వాసుదేవరావు మృతి పార్టీ కార్యాలయానికి కొంత ఆలస్యంగా తెలియజేయడంతో ఆ కుటుంబానికి ఎటువంటి సాయం అందలేదని వివరించారు. ఈస్థితిలో స్పందించి ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత పథకంతో పొట్ట కొట్టొద్దు

- ఆటో కార్మికులు ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

మహారాణి పేట, జనవరి 5: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం అమలు చేసి తమ పొట్ట కొట్టవద్దని ఆటోడ్రైవర్లు అభ్యర్థించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు వినతి పత్రమిచ్చారు. ఈసందర్భంగా సంఘ నాయకుడు గొలగానినాయుడు మాట్లా డుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాజకీ య స్వలాభం కోసం వివిధ పార్టీలు మ హిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకల్లో మహి ళలకు ఈపథకం అమలు చే యటం తో ఆ రాష్ట్రాల్లో ఆటో కార్మికు లకు వీధినపడ్డారన్నారు. ఈ పరిస్థితి చూసి రాష్ట్రంలో ఆటో కార్మికులు అధైర్య పడుతున్నారన్నారు. ఈ దృష్ట్యా ఉచిత ఆర్టీసీ ప్రయాణం రాకుండా చూడాలని డి మాండ్ చేశారు. నారి రాజనాయుడు జీ రామారావు, నాగుతోపాటుఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు యూనిఫారాల పంపిణీ

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పలు వార్డుల్లోని కూడళ్లలో ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు వైసీపీ పాలనపై విసుగుతో ఉన్నారని, ప్రభుత్వం మార్పు కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

సాంకేతిక పరిజ్ఞాన బోధనతో సత్ఫలితాలు

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్
- ఎలమంచిలిలో జోన్ 1 కళాశాలల సమీక్ష సమావేశం


పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఎలమంచిలి, జనవరి 5 : కళాశాలల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధన చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చునని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జోన్-1 కళాశాలల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారాన్ని తీసుకొని నాక్ ఏ గ్రేడును సాధించడమే కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి పొందడం గొప్ప విషయమన్నారు. కళాశాల అధ్యాపక బృందాన్ని ఆయన ఈసందర్భంగా అభినందించారు. సమష్టిగా కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్న కళాశాల పరిసరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విభాగాలు, జిమ్ తదితర విభాగాలను బృంద సభ్యులంతా పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పోలా భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన 40 ప్రభుత్వ, 3 ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కళాశాలల అంతర్గత నైపుణ్యాల మదింపు సంస్థల అధికారులు ఏజీఓ తులసి మస్తానమ్మ, జోన్ వన్ ఆర్‌జేడీ శోభా హాజరయ్యారు.

వినియోగదారుల సంఘం అధ్యక్షుడికి అభినందన


సత్యనారాయణకు ప్రశంసా పత్రం అందిస్తున్న జేసీ విశ్వనాథన్

అక్కయ్యపాలెం, జనవరి 5 : వినియోగదారులను వారి హక్కులపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడంలో విశాఖ జిల్లాను ఆంధ్రప్రదేశ్‌లో రెండో స్థానంలో నిలపడంపై జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మర్రి సత్యనారాయణను జేసీ కె.విశ్వనాథన్‌ను అభినందించారు. ఈమేరకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కలెక్టర్‌తో ఏపీఎన్‌జీవో నాయకుల సమావేశం

మహారాణిపేట, జనవరి 5: ఏపీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు కలెక్టర్ ఏ మల్లికార్జునతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ముందుగా అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కార్యదర్శి కేవీ శివారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు కే ఈశ్వరరావు, నాయకులు ఆర్. రవిశంకర్ , పురుషోత్తమ నాయుడు , డీవీ రమణ , ఆర్‌వీ సత్య నారాయణ, సుబ్రహ్మణ్యం, ఉమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్, జనవరి 5: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలక సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు మొహమ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఈమేరకు పోస్టర్లను కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్ వంకాయల సన్యాసిరాజు ఆవిష్కరించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

సీతమ్మధార, జనవరి 5: స్థానిక ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను శనివారం సాయంత్రం ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆరోలియన్ ఒడిసే పేరిట సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొంటారన్నారు.

41వార్డులో పింఛన్లు పంపిణీ

జ్ఞానాపురం, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ఈనెలనుంచి పెంచిన రూ. వేల సామాజిక పింఛన్లను శుక్రవారం జ్ఞానాపురంలో కార్పొ రేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారని ఈసందర్భంగా అన్నారు. జోన్-5 యూసీడీపీడీలు పద్మావతి, చిరంజీవిలున్నారు.

ఆదాయం రూ.160 కోట్లు, వ్యయం రూ.215 కోట్లు

- ఫిబ్రవరి నాటికి సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పూర్తి
- వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక
- ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం
- వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరు నెలాఖరు వరకు రూ.160 కోట్ల ఆదాయం రాగా, రూ.215 కోట్లు వ్యయం చేశామని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారు. సిరిపురం చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా చేశామని, ఆ మిగిలిన మొత్తాన్ని మార్చి నెలాఖరులోగా సాధిస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. గతంలో కంటే ఇప్పుడు వీఎంఆర్‌డీఏ ఎక్కువ ప్రాజెక్టులు చేస్తున్నదని చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో మొత్తం తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు ప్రతిపాదించగా వాటిలో మూడు పూర్తయ్యాయని, ఇంకో ఆరు నిర్మాణంలో ఉన్నాయన్నారు. సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనాన్ని ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో రైలు ఓవర్ బ్రిడ్జి పనులు సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమయ్యాయని, దీనిని సెప్టెంబరులో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. బీచ్‌లో ఓషన్ డెక్, తెన్నేటి పార్కు వద్ద ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నాయన్నారు. కైలాసగిరిపై జిప్ లైనర్, స్కై సైక్లింగ్ వంటివి కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇవి రెండున్నర నెలల్లో పనిచేస్తాయన్నారు. కైలాసగిరిపై రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల వ్యయంతో పీపీపీలో నేచురల్ రిసార్ట్స్, రివాల్వింగ్ రెస్టారెంట్ వస్తాయన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక బీచ్ వద్ద ఏడు ఎకరాల స్థలం ఉందని, అందులో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపడతామన్నారు. దీనికి రూ.220 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ దాట్ల కీర్తి, సీఈ శివప్రసాద్‌రాజు, ఎస్‌ఈలు భవానీశంకర్, బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరిక లేకే.. విశాఖ ఉత్సవ్ నిర్వహించలేదు

ఏటా డిసెంబరులో జరిగే విశాఖ ఉత్సవ్ కోసం నగరవాసులు ఎంతో ఆశగా ఎదురు చూస్తారని, అటువంటి వేడుకను రెండేళ్లుగా ఎందుకు నిర్వహించడం లేదని విలేకరులు కలెక్టర్ వద్ద ప్రస్తావించగా.. తీరిక లేకే నిర్వహించలేకపోయామని సమాధానమిచ్చారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పర్యాటక అభివృద్ధిపై చర్చలో పలువురు విశాఖ ఉత్సవ్ అంశాన్ని లేవనెత్తారు. కరోనా సమయంలో వీలుకాక నిర్వహించలేదని, గత రెండేళ్లుగా అవకాశం ఉన్నా నిర్వహించలేదని దీనికి ప్రత్యేక కారణాలు ఏమీ లేవని కలెక్టర్ స్పష్టంచేశారు.

అయోధ్య అక్షతల పంపిణీ

కూర్మన్నపాలెం, జనవరి 5: అయోధ్య శ్రీరాముని అక్షతలను జీవీఎంసీ 86 వార్డు శాతవాహననగర్‌లో శుక్రవారం ఇంటింటా పంపిణీ చేశారు. వాటితో పాటు రామ విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెన్నా శ్రీరామమూర్తి, బొండా ఎల్లాజీ బంద్రెడ్డి శేషగిరిరావు, కృష్ణమాచార్యులు, బొండా శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

కూర్మన్నపాలెం, జనవరి 5: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు శుక్రవారం రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కంచుమూర్తి ఈశ్వర్ వినతిపత్రం ఇచ్చారు. మౌలిక వసతుల కల్పనలో శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చి ఉక్కు ఉద్యోగులకు మెరుగైన సేవలందించాలని ఆస్పత్రి సీజీఎం కేహెచ్ ప్రకాష్‌ను ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. ఆస్పత్రిలో శుక్రవారం ఆయనను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య నిపుణుల సంఖ్య పెంచాలని, ఎంవోయూ విషయంలో ఇబ్బందులు తొలగించాలని విన్నవించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గోపాలపట్నం, జనవరి 5: గ్రేటర్ 92వ వార్డులోని పద్మనాభనగర్ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల్లో చేపడుతున్న రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భం గా అధికారులకు బెహరా సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహనరావు, ఈఈ రమణమూర్తి, ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అగనంపూడి, జనవరి 5: అనారోగ్యంతో బాధపడుతున్న కర్రి రమేశ్‌ను ఆదుకునేందుకు దాతలు ముందుకొచ్చారు. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు చొరవతో దాతలు రూ. 15 వేలు సమకూర్చారు. శుక్రవారం దిబ్బపాలెంలో రమేశ్‌ను కలిసి నగదు అందజేశారు.రమేశ్‌ను దాతలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుదే సుశీగజేంద్రరరావు, కడిమి హనుమంతురావు, శీరంశెట్టి గోవిందరావు, పొనగంటి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెత్త తరలింపు

వేపగుంట, జనవరి 5: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెం సమీప జె.ఎస్.ఆర్.ఎమ్.కాలనీలో పేరుకుపోయిన చెత్తను ఎట్టకేలకు అధికారులు శుక్రవారం తొలగించారు. శివారు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవటంపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమవడంతో స్పందించిన శానిటరీ అధికారులు ప్రైవేటు వాహనాలు సమకూర్చి, చెత్తను తరలించారు. దీంతో పది రోజులుగా ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం దొరికిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు పరిరక్షణకు నడుంకట్టాలి



రిలే దీక్షలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, జనవరి 5: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో 1058వ రోజు దీక్షల్లో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌కు సొంత గనులు అవసరమన్నారు. మరో నాయకుడు అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమం ఉధృతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 46, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 105, బరబాటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 36 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 50, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	70
ఫారం ధర	--	90
విత్ స్కిన్	--	150
స్కిన్‌లెస్	--	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే విజయం

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 5: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గ్రేటర్ 61వ వార్డు వెంకన్నపాలెంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరో మూడు నెలల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి ప్రజలందరి కష్టాలను తీరుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి, ఆ పార్టీని గద్దె దింపే వరకు శ్రమించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్జి సోమేశ్, కాకిపోలిరెడ్డి, చిన్న, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, సత్యనారాయణ, జోగి తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పాలి

పెదగంట్యాడ: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయడం ద్వారా జగన్‌ను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణా కోరారు. పెదగంట్యాడ మండల టీడీపీ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లిముక్కు నీలాపువీధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి వారికి మేనిఫెస్టోను వివరించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలోని అన్నింటినీ అమలు చేస్తామన్నారు. 75వ వార్డు కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్లు, ములకలపల్లి పెంటయ్య, కాకినాడ అప్పలరాజు, మొల్లి సోమునాయుడు, నమ్మిపుప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

86వ వార్డులో

కూర్మన్నపాలెం: రాష్ట్రం స్వర్ణాంధ్ర కావాలంటే చంద్రబాబును సీఎంను చేయాలని 86వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉడానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని అంశాలను స్థానిక ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని రక్షించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వేగుంట శ్రీనివాస్, రుక్మిణి, గోవింద్, లోకేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టోపై ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

సేనాతివానిపాలెంలో...

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు సేనాతివానిపాలెం, ఆర్‌టీసీకాలనీ, ఎల్.బి.నగర్‌లో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను వివరించి, ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొబ్బర నరసింహనాయుడు, అజయ్, జనసేన నేత వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా పారిశుధ్య కార్మికుల సమ్మె

మల్కాపురం, జనవరి 5: పారిశ్రామిక ప్రాంతంలో జీవీఎంసీ కార్మికుల సమ్మె ఉధృతంగా సాగుతోంది. శుక్రవారం కార్మికులు చెత్తకుప్పల వద్ద కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలో ప్రైవేట్ కార్మికులు వచ్చి చెత్తకుప్పలను తొలగించేందుకు సిద్ధం కావడంతో వారితో పాటు వ్యాన్‌లను అడ్డుకున్నారు. 11 రోజులుగా తాము సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. క్లాప్‌డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలన్నారు. తమ శ్రమను పాలకులు చులకనగా చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రమణబాబు, రాంబాబు,రాము, రైలుబాబు, గొల్లబాబు, తిరుపతిరావు, ఉమ, దేవి, దుర్గ, పాప, లలిత, లక్ష్మి, సూరమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చెత్తకుప్ప వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన

పెందుర్తిలో దిగజారిన పారిశుధ్యం

పెందుర్తి: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పెందురిలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. స్థానిక జంక్షన్‌లో తోపుడు బండ్ల వ్యాపారులు, హోటల్స్‌లోని చెత్తను రోడ్డు మీదనే వేస్తున్నారు. కుళ్లినపండ్లు, వ్యర్థాలు, ఆహార పదార్థాలతో జంక్షన్‌లో భరించలేనంతగా దుర్గంధం వెలువడుతోంది. ఈ చెత్త వద్ద పందులు, కుక్కల సంచారంతో స్థానికులు మరింత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వార్డుల్లో చెత్త చెదారాల తొలగింపునకు అధికారులు చేపడుతున్న ప్రత్యామ్నాయ చర్యలు పూర్తిస్థాయిలో ఫలితమివ్వడంలేదు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధికి గండి

» ఆందోళనకు దిగిన ఆటో డ్రైవర్లు

గాజువాక, జనవరి 5: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే దిశగా చేపడుతున్న చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పారిశ్రామిక ప్రాంత ఆటో డ్రైవర్లు, యజమానులు శుక్రవారం పాతగాజువాక జంక్షన్ వద్ద భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఉచిత ప్రయాణంతో ప్రభుత్వానికి నష్టంతోపాటు ఆటో డ్రైవర్లు రోడ్డున పడతారని ఆందోళన వ్య క్తంచేశారు. ఆటోలను జీవనాధారంగా జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి తీవ్ర ఇబ్బందుల్లో పడుతుందన్నారు. వెంటనే ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. పాతగాజువాక నుంచి షీలానగర్ వరకు పాదయాత్రగా వెళ్లి అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వాహనాల్లో వెళ్లారు. పాదయాత్రలో పారిశ్రామిక ప్రాంతం నుంచి 86 ఆటో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం వద్ద ఆటోలను నిలిపివేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండడాన్ని నిరసిస్తూ శుక్రవారం గాజువాక ఆటో కార్మికులు చేపట్టిన ఆందోళనకు 68, 69 వార్డుల పరిధిలోని కార్మికులు మద్దతు తెలిపారు. షీలానగర్, అక్కిరెడ్డిపాలెం, బీహెచ్‌పీవీ, నాతయ్యపాలెం జంక్షన్‌ల వద్ద ఆటోలను నిలిపివేసి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలను కూడా నిరోధించారు. స్టాండ్‌ల వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలుచేసి ఆటో కార్మికుల ఉపాధికి గండి కొట్టవద్దని వారు విన్నవించారు.



గాజువాకలో ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

గాజువాక, జనవరి 5: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, అప్పారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ పంప్‌హౌస్ వద్ద ఆందోళన

శ్రీనగర్ పంప్‌హౌస్ వద్ద...

శ్రీనగర్: నీటి సరఫరా విభాగం కార్మికులు శుక్రవారం శ్రీనగర్ పంప్‌హౌస్ వద్ద నాలుగో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.



షీలానగర్ పంప్‌హౌస్ వద్ద వంటావార్పు

షీలానగర్‌లో...

అక్కిరెడ్డిపాలెం: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది శుక్రవారం షీలానగర్ పంప్ హౌస్ వద్ద ఆందోళన నిర్వహించారు. 68, 69 వార్డులలో కొద్ది సేపు మాత్రమే నీటిని సరఫరా చేసిన ఇంజనీరింగ్, వాటర్ సిబ్బంది షీలానగర్ పంప్‌హౌస్ వద్ద విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది వంటావార్పు చేపట్టి తమ నిరసన తెలిపారు. వీరు చేపట్టిన ఆందోళనకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మద్దతు తెలిపి. వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా తమ న్యాయమైన డిమాండ్‌లు సాధన కొరకు ఆందోళన చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

పెదగంట్యాడ, డిసెంబరు 5: కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9వేలు, డీఏ ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్ డిమాండ్ చేశారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో శుక్రవారం అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్స్ కుటుంబసభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, రైళ్లలో సీనియర్ సిటిజన్స్ రాయితీని పునరుద్ధరించాలన్నారు. పారిశ్రామిక ప్రాంత శాఖ కార్యదర్శి కణితి అప్పలరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో కె.దీనబంధు, బి.గురప్ప, వెంకటరావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు

అంగన్‌వాడీల అలుపెరగని పోరు



తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పెందుర్తి, జనవరి 5: అంగన్‌వాడీ తమ సమస్యలు పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె కొనసాగుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలంతా పాల్గొని జగన్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన కోర్కెల సాధనకు చేపడుతున్న సమ్మెపై ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. సీటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, దేవి పాల్గొన్నారు.



శాంతినగర్ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు



పెందుర్తిలో స్వామికి క్షీరాభిషేకం

వెంకటేశ్వరస్వామికి వైభవంగా ధనుర్మాస పూజలు

అగనంపూడి, జనవరి 5: ధనుర్మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి అర్చకులు సత్యనారాయణ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి, స్థానిక నాయకులు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వెంకటాద్రి శిఖరంపై...

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని వస్త్రాలతో అలంకరించారు. వేకువజామున భక్తులుసామూహికంగా తిరుప్పావై పఠించారు. గోదాదేవికి కుంకుమ పూజలు చేశారు. గోదాదేవి పాశురాన్ని స్వామికి నివేదించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి



హర్భజన్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కృషి చేయలని కోరుతూ హెచ్‌ఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హర్భజన్‌సింగ్‌కు ఉక్కు హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి వినతి పత్రం అందజేశారు. నాగపూర్‌లో జరుగుతున్న హెచ్‌ఎంఎస్ జాతీయ సదస్సులో శుక్రవారం పాల్గొన్న ఆయన పలు విషయాలపై జాతీయ కార్యవర్గం ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సం స్థలను ప్రైవేటీకరించడం వల్ల రానున్న రోజుల్లో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలి'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5: రాష్ట్రంలో అంగన్‌వాడీలు, మునిసిపల్, సర్వశిక్ష అభియాన్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధాలను తీవ్రంగా ఖండించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. సీఐటీయూ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిపాలన భవనం వద్ద సమ్మె చేస్తున్న కార్మిక వర్గానికి మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు ప్రస్తుతం విలువ లేకుండా పోతోందన్నారు. కొద్దిరోజులుగా కార్మిక వర్గం సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వైటి.దాసు, నాయకులు రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కార్మికుల్లో భయాందోళనలు సృష్టించవద్దు'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5: సంస్థ ప్రగతి కోసం శ్రమిస్తున్న కార్మిక వర్గంలో భయాందోళనలు కలిగించే విధంగా యాజమాన్యం నిర్ణయాలు తీసుకోవద్దని కోరుతూ సీజీఎం (హెచ్‌ఆర్) గాంధీకు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కెఎస్ఎన్.రావు నేతృత్వంలో నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్లాంట్ ఇప్పుడిప్పుడే క్లిష్ట పరిస్థితులను దాటుకొని ముందుకు సాగే క్రమంలో కార్మికుల మెడికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను విరమించుకోవాలన్నారు. కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే నాగిరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం, జనవరి 5: ప్రజా సంక్షేమమే వైసీపీ ధ్యేయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి, కణితి, దుగ్గపువానిపాలెంలలో శుక్రవారం గాజువాక ఎమ్మెల్యే రూ.40 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనం రక్షణ గోడల, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ఎస్ఎస్ విజయ రామరాజు, విజయలక్ష్మి, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజు, పి. శంకరరావు, రమణ, కోమటి రమాదేవి, గొనప సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అవ్వా తాతల మొహాల్లో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వికాస్‌నగర్‌లో శుక్రవారం సామాజిక పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. పెన్షన్ రూ.3వేలకు పెంచడంతో ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. గాజువాక జెడ్సీ పి.సింహాచలం, వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, రామారావు, సుజాత, మహ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

రేషన్ వాహనం వీధిలోకి రాకపోతే ఎలా?



వాహనం కోసం రోడ్డుపై వేచి చూస్తున్న కార్డుదారులు

గోపాలపట్నం, జనవరి 5: ప్రభుత్వం చెబుతున్న విధంగా లబ్ధిదారుని ఇంటికే రేషన్ సరుకులు పంపణీ చేయకపోవడంతో లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ 91వ వార్డు నేతాజీవీధిలోకి 87వ నెంబరు రేషన్ డిపోకు చెందినవాహనంతో స్థానిక లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తుంటారు. వీధిలోకి వచ్చి రేషన్ పంపిణీ చేసేవారు. అయితే, గత రెండు నెలల నుంచి రేషన్ వాహనాన్ని వీధిలోకి తీసుకురాకుండా సమీపంలోని రహదారిపైనే నిలిపి పంపిణీ చేస్తున్నారు. దీంతో ఈమార్గంలో రాకపోకలకు అంతరాయంకలగడంతోపాటు వాహన చోదకులకు కూడా ఇబ్బం దులు తప్పడం లేదు. ఎప్పటిలాగే వీధిలోకి వాహనాన్ని తీసుకువచ్చి సరుకులు పంపిణీ చేయాలని వాహనదారుడికి స్థానికులు చెబుతున్నా పట్టించుకోపోవడంతో శుక్రవారం సాయంత్రం స్థానికులు నిరసనకు దిగారు. ఈ విషయంపై సివిల్ సప్లై అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వేటగాళ్ల వలలో చిక్కుకున్న శునకం

రక్షించిన నేవీ ఉద్యోగులు

సింధియా, జనవరి 5: ప్రాణాపాయంలో ఉన్న మూగజీవిని రక్షించి నేవీ ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. యారాడ డాల్ఫిన్ కొండ ప్రాంతంలో అడవి పందులకోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులో ఓ శునకం చిక్కుకుంది. కొద్దిరోజులుగా ఆర్తనాదాలు పెడుతూ తప్పించుకునే ప్రయత్నంలో తీవ్ర గాయాలపాలైంది. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన నేవీ ఉద్యోగులు కుక్కను రక్షించి జంతు సంరక్షణ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించారు.

IN THE HONOURABLE COURT OF THE JUDGE, ADDITIONAL FAMILY COURT, AT ANAKAPALLI

FCOP 843/2023

Between :
Emandi Anuradha ...Petitioner
And
Emandi Kanaka Kumar ...Respondent

To
R 1) Emandi Kanaka Kumar
S/o. Simhachalam
Carrying Transport business
Door No.36-91-81, Ravindranagar, Kancharapalem, Besides Sri Balaji Traders, Visakhapatnam-530008.

Please take notice that the above Petition is posted on 10-01-2024 for your notice by way of substituted service of summons as ordered by the Honourable Court vide its orders dt.27-11-2023. Therefore, you are informed by means of this notice that you have to appear in the above matter before the court at 10.30 A.M. either in person or thorugh an Advocate to answer the petitioner's claim in the above petition, failing which the claim in the petition will be decided in your absence.

Visakhapatnam
Dt.05-01-2024

Advocate for the Peititoner
(P. APPANNA)
Advocate



తొలగించనున్న ఇటీవల లక్షలతో నిర్మించిన టాయిలెట్‌లు



సచివాలయ భవనం కూల్చివేత

బాగున్న భవనాలనూ.. కూల్చేస్తున్నారు..!

- 41వ వార్డులో సచివాలయాల కూల్చివేత
- గతంలో ఉన్న కల్యాణమండపం పునరుద్ధరణ పేరిట పనులు
- ప్రజాధనం దుర్వినియోగంపై స్థానికుల ఆగ్రహం

జ్ఞానాపురం, జనవరి 5: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఇంజనీరింగ్ అధికారులు తీరుతో ప్రజాధనం వృథాగా అవుతోంది. అవసరం ఉన్నచోట సౌకర్యాలు కల్పించకుండా ఉపయోగంలేని చోట్ల పనులతో జీవీఎంసీకి లక్షలాది రూపాయల నష్టం చేకూరుతోంది. ఈ కోవలో 41వ వార్డు పరిధి జ్ఞానాపురంలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఇక్కడి జోనల్ కార్యాలయానికి ఆనుకుని మరియదాసు కల్యాణ మండపం ఉంది. దీనిని స్థానికులు సామాజిక అవసరాలకోసం వినియోగించేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సామాజిక భవనాన్ని సచివాలయాలుగా మార్చారు. ఆ ప్రాంతంలో ఉన్న టాయిలెట్లను మాత్రం సరిదిద్దలేదు. ఈనేపథ్యంలో అనేక విజ్ఞాపనల మేరకు 2022లో రూ. 2 లక్షల వ్యయంతో వీటికి మరమ్మతులు చేశారు. కొత్తగా పలకలువేసి, టాయిలెట్ సామ గ్రితో తీర్చిదిద్దారు. నీటి సరఫరాలేక వీటిని ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు. ఇప్పుడు మళ్లీ సచివాలయాలు తరలించి సామాజిక భవ నం నిర్మిస్తామంటూ ఈ భవనాలు తొలగిస్తున్నారు. వాటిలో భాగంగా మరమ్మతులు చేపట్టిన టాయిలెట్లనూ పగులగొడుతున్నారు. ఎప్పటి నుంచో సామాజిక భవనం ప్రతిపాదన ఉన్న ఈ ప్రాంతంలో ఎలా ప్రజాధనం దుర్వినియోగం చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ జోనల్ కార్యాలయంలో ప్రజలు కానీ, కార్యాలయ సిబ్బంది కానీ వినియోగించేందుకు వీలుగా మా త్రం టాయిలెట్లు ఇంజనీరింగ్ అధికారులు నిర్మించలేదని వాదన స్థానికులనుంచి వినిపిస్తోంది.

మూలకుచేరిన పీపీఈ కిట్లు

వీటితోపాటు కొవిడ్ సమయంలో జోన్‌కు అందించిన వేలాది పీపీఈ కిట్లు, ఆసుపత్రి సామగ్రి ఈ సచివాలయ భవనంలో ఉన్నాయి.ప్రస్తుతం పర్యవేక్షణలేక పాడైపోతున్నాయి. మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో ఈ కిట్లను అధికారులు భద్రపరచకుండా వదిలేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.



సచివాలయం ఆవరణలో వృథాగా వదిలేసిన పీపీఈ కిట్లు

కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎదగాలి

- కాపునాడు కన్వీనర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కాపునాడు కన్వీనర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, జనవరి 5: కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎగదాల్సిన అవసరం ఉందని కాపునాడు రాష్ట్ర కన్వీనర్ గిద్దా శ్రీనివాసనాయుడు తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు రాజ్యాధికారం, భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న విజయవాడ గాంధీనగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో విశాఖలో ఆరు ఎమ్మెల్యేలు, ఎంపీ సీటు కాపులకు కేటాయించాలని తెలిపారు. విశాఖపట్నం కన్వీనర్ తలారి సురేష్ , జిల్లా మహిళా కన్వీనర్ మంగతాయారు, సీతారాం, ఎం.సురేశ్, ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

హార్బర్ ట్రాఫిక్ సీఐగా షణ్ముఖరావు

మహారాణిపేట, జనవరి 5: హార్బర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గాఎస్. షణ్ముఖరావును నియమించారు. ఇక్కడ పని చేసిన జీఆర్‌కే తులసీదాస్‌ను వీఆర్‌కు సరెండరు చేశారు.

'ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి'

కంచరపాలెం, జనవరి 5: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సమ గ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ ఎదుట గాంధీ వి గ్రహం ఎదుట నిరసన కొనసాగించారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు

భువనేశ్వరితో టీడీపీ నాయకుల భేటీ



భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి నాయకులు

మహారాణిపేట, జనవరి 5: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరీతో శుక్రవారం పలువురు పార్టీ నాయకులు సమావేశమయ్యారు. నిజం గెలవాలి కార్యక్రమం కోసం విశాఖ వచ్చిన ఆమెతో హోటల్ నోవాటేల్ లో పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ డీరామారావు, బుద్దా వెంకన్న, ఇన్‌చార్జిలు కోరాడ రాజబాబు, గండిబాబ్జీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్‌నజీర్ పాల్గొన్నారు.

'నారా' కుటుంబ నిబద్ధతకు నిదర్శనం' : జనసేన

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి లోనై మృతి చెందిన కుటుంబాలను పరామర్శకు ఆయన సతీమణి భువనేశ్వరి రావడం.. నారా కు టుంబం నిబద్ధతకునిదర్శనమని జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం విశాఖలోని హోట ల్ నోవాటెల్‌లో నారాభువనేశ్వరినినేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వం ఏర్పాటుచారిత్రాత్మక అవసరమన్నారు. వైసీపీపాలనపై ప్రజలు విసిగి పోయారన్నారు.

పార్టీ అండగా ఉంటుంది

... 5వ పేజీ తరువాయి

టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూస్తామని హామీ ఇచ్చారు. మురళీనగర్‌లో భోజనం చేసిన అనంతరం గాజువాక వెళ్లారు. బీసీ రోడ్డుకు చెందిన కోరుకొండ వెంకటరమణ, భానోజీ కాలనీ ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి సరోజినీదేవి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తుందని, మీ కుటుంబాలకు మరింత చేయూతనిచ్చి తోడునీడగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి (టీడీపీ బాబాయి) కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన భార్య పార్వతి దేవి, కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, సుధాకర్‌లను పరామర్శించిన ఆమె అండగా తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు టీడీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తాము అన్ని వేళలా అండగా నిలుస్తామన్నారు. రాధాకృష్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. ఇదిలావుండగా పాతగాజువాకలో నారా భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నజీర్, చిక్కాల విజయ్, అనంతలక్ష్మి, కార్పొరేటర్‌లు పల్లా శ్రీనివాసరావు, గందం శ్రీనివాసరావు, పులి లక్ష్మిబాయి, నాయకులు నల్లారు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఖాళీ అవుతున్న స్టీల్‌ప్లాంట్

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ఆ ఖాళీలను ఇప్పటివరకు భర్తీ చేయలేదు.

ప్రైవేటీకరణ ప్రకటనతో ఆందోళన

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తైతే తమ ఉద్యోగాలు పోతాయోమోననే ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. దీంతో సమస్య మరింత జఠిలమవుతోంది. పైగా వచ్చే ఏడాది ఏకంగా 1084 మంది ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఇప్పటికే అధిక పనిభారంతో పనిచేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఉద్యోగాల నియామక ప్రక్రియను యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ప్లాంట్‌పై తీవ్రస్థాయిలో కుట్ర జరుగుతోందనే అనుమానం అటు ఉద్యోగులు, ఇటు కార్మికుల్లో నెలకొంది.

కొత్త నియామకాలు చేపట్టాలి

స్టీల్‌ప్లాంటులో తక్షణమే నియామకాలు చేపట్టాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని, ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు కూడా అందజేశాం. ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యానికి అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య ఉండాలి. ఆ దిశగా యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- కేఎస్ఎన్ రావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు

పూజారికి సమర్పయామి

... 5వ పేజీ తరువాయి

కోర్కెలు తీరుతాయని ఇటీవల కాలంలో బాగా ప్రచారం జరుగుతోంది. దాంతో భక్తులు బెల్లం దిమ్మలను తీసుకువచ్చి వినాయకుడికి సమర్పిస్తుంటారు. దీంతో 'బెల్లం వినాయకుడి'గా ప్రసిద్ధికెక్కారు.

హక్కుల కోసం పోరాటాలు

రెండు దశాబ్దాల క్రితం ఈ ఆలయానికి భక్తులు పెద్దగా వెళ్లేవారు కాదు. దసపల్లా హోటల్ వద్ద గల శివాలయం పూజారులే దానికి అర్చకులుగా ఉండేవారు. వారు ఎక్కువ సమయం దసపల్లా హోటల్ వద్ద గల శివాలయంలో ఉండడం వల్ల రామలింగేశ్వర దేవస్థానంలో పెద్దగా పూజాదికాలు జరిగేవి కావు. ఈ నేపథ్యంలో వారం కొంతకాలం క్రితం పద్మనాభశర్మ అనే పూజారిని రామలింగేశ్వర దేవస్థానానికి పంపించారు. ఆయన వచ్చిన తరువాత శివుడి కంటే వినాయకుడిపైనే ఎక్కువ దృష్టి పెట్టి..బెల్లం సమర్పిస్తే కోర్కెలు తీరతాయంటూ ప్రత్యేక పూజలు చేయడం ప్రారంభించారు. అలా అది ప్రాచుర్యంలోకి వచ్చింది. భక్తులు తెచ్చిన బెల్లాన్ని ఆయన విక్రయించుకుంటూ, ధనిక భక్తులతో పెద్ద పెద్ద పూజలు, హోమాలు చేయిస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. దాంతో ఆ ఆలయాన్ని మళ్లీ తమకే ఇచ్చేయాలని దసపల్లా పూజారులు గొడవకు దిగారు. తాను అభివృద్ధి చేసినందున తనకే హక్కులు ఉన్నాయని పద్మనాభశర్మ వాదించడం ప్రారంభించారు.

బెల్లం వేలంపై స్టే

ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోనే ఉంది. ఆ లెక్కన దేవుడికి వచ్చే కానుకలన్నీ ప్రభుత్వానికే చెందాలి. కానీ ఇక్కడ పూజారి బెల్లాన్ని తీసుకుని విక్రయించుకొని లాభపడుతుండడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో రెండేళ్ల క్రితం అప్పటి అసిస్టెంట్ కమిషనర్ శాంతి ఆలయానికి ప్రత్యేకంగా ఈఓను నియమించి, లెక్కలు రాయించడం మొదలపెట్టారు. ఆ తరువాత బెల్లాన్ని వేలం వేయడానికి యత్నించారు. పత్రికా ప్రకటన ఇచ్చారు. దాంతో ఆలయ పూజారి హైకోర్టును ఆశ్రయించారు. భక్తులు స్వామికి ప్రసాదంగా ఇచ్చే బెల్లాన్ని వేలం వేయడం తగదని విన్నవించుకోవడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. దాంతో వేలం ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ యథాప్రకారం అర్చకులే బెల్లాన్ని తీసుకుంటున్నారు.

హక్కులపై ట్రిబ్యునల్‌కు

దసపల్లా శివాలయం పూజారులు బెల్లం వినాయకుడి గుడి అర్చకులుగా తామే ఉన్నామని, అది తమకే చెందాలని ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. అయితే దేవదాయ శాఖ రిజిస్టర్ నంబరు 38లో పూజారులుగా దసపల్లా శివాలయంలో పనిచేస్తున్న వారి పేర్లు ఉన్నప్పటికీ, ఆ తరువాత అమలులోకి వచ్చిన మరో రిజిస్టర్ 43లో కొత్త పూజారి పద్మనాభశర్మ, శ్రీకాంత్‌శర్మలు పేర్లు ఉండడంతో వారే కొనసాగాలని ట్రిబ్యునల్ స్పష్టంచేసింది. దీనిపై వారు మరో అప్పీల్ చేయాలని భావిస్తున్న సమయంలో ఆ కుటుంబ పెద్ద మరణించారు. దాంతో అక్కడ ఆగింది.

రూ.5 లక్షల లోపు ఆదాయం అంటూ హక్కులకు యత్నం

ఇటీవల సుప్రీంకోర్టు ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను దేవదాయ శాఖ పరిధి నుంచి తప్పించి, ట్రస్టీలకు, వంశపారంపర్య అర్చకులకు అప్పగించాలని ఆదేశించింది. ఆ నిబంధనల ప్రకారం గుడిని దేవదాయ శాఖ నుంచి తప్పించి తమకు అప్పగించాలని పూజారి శ్రీకాంత్‌శర్మ దరఖాస్తు చేసుకున్నారు. అయితే అది రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయం అయినప్పటికీ దాని బాధ్యతలు తీసుకోవడానికి దరఖాస్తు చేసిన అర్చకులు వంశ పారంపర్యంగా వచ్చినవారు కాదు కాబట్టి వారికి ఇవ్వలేమని జిల్లా అధికారులు తేల్చి చెప్పి దరఖాస్తును తిరస్కరించారు. ప్రస్తుతం ఆలయం దేవదాయ శాఖ పరిధిలోనే ఉంది. కానీ ప్రధాన ఆదాయం బెల్లం మాత్రం అర్చకులకే వెళుతోంది. ఇంకా పూర్తిస్థాయి హక్కుల కోసం అన్ని వర్గాలు ప్రయత్నం చేస్తున్నాయి.

కేజీహెచ్‌లో స్వీపర్ అరాచకం

... 5వ పేజీ తరువాయి

నిద్రిస్తుండగా ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న ధనాల వాసు మద్యం మత్తులో వెనుక నుంచి గట్టిగా కొరికాడు. దీంతో ఆమె ఉలిక్కిపడి లేచి కేకలు వేసింది. శరీరంపై పంటి గాట్లు పడడంతో సిబ్బంది వెంటనే చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

నేటి నుంచి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ తమ్మిరెడ్డి

సీతమ్మధార, జనవరి 5: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలను శనివారంనుంచి నిర్వహిస్తున్నట్టు ఆంధ్రయూనివర్శిటీ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ మధుకుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా క్యాంపస్‌లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం 46వ వార్షిక సమావేశాన్ని, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చారిత్రక కథనాల పరిశోధనకు ఈవెంట్ వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఏపీహెచ్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కె.మూర్తి, ప్రొఫెసర్ ఎస్.మురళి మోహన్, బి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ప్రతినిధులు సందర్శన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ తమ్మిరెడ్డి

మురళీనగర్, జనవరి 5 ; మురళీనగర్ బాలభాను ప్రైవేట్ పాఠశాలను శుక్రవారం విదేశీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఏటా తమ పాఠశాలకు ప్రతినిధులు విచ్చేస్తుంటారని, ఇందులో భాగంగా ఈసారి వచ్చినట్టు పాఠశాల ప్రిన్సిపల్ శుభశ్రీ తెలిపారు. స్పెయిన్, స్విట్జర్లాండ్, అమెరికా దేశాలనుంచి విచ్చేసిన ప్రతినిధులు చిన్నారులతో ముచ్చటించారు. వారి విద్యా బోధన, ప్రగతి తదితర అంశాలను అడిగి తెలుసుకు న్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి..

అక్కయ్యపాలెం: హెచ్‌టీ లైన్స్‌కు నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. మహారాణి పార్లర్ ఏరియా, జీవీ ఎంసీ జడ్పీ పాఠశాల ఏరియా, చిన్నూరు, జగ్గారావు బ్రిడ్జి ఏరియాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

3937 మందికి ద్వై వార్షిక సంక్షేమ ఫలాలు: కలెక్టర్

మహారాణి పేట, జనవరి 5: ద్వైవార్షిక సంక్షేమ నిధులు మంజూరులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 3937 మంది రూ. 5, 58, 26, 443 కోట్ల లబ్ధి పొందినట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపా రు. అర్హత ఉన్నా, సాంకేతిక సమస్యలతో లబ్ధిపొందని వారికి మరోసారి అవకాశం కల్పిస్తు ముఖ్య మంత్రి జగన్‌మోహనరెడ్డి ఈ నిధులు మంజూరు చేశారన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నా రు.ఈబీసీ నేస్తాం, అమ్మఒడి, చేదోడు పథకం,వైయస్ఆర్, కళ్యాణమస్తు షాదీ తోఫా, కాపునేస్తం, మత్స్యకార భరోసా వాహన మిత్ర తదితర పథకాల్లో పలువురు లబ్ధి పొందారన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్

'బాధిత కుటుంబాన్ని ఆదుకోరూ..'

అక్కయ్యపాలెం, జనవరి 5: టీడీపీ అధినే నారా చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సంఘటనలతో మనస్తాపంతో మృతి చెందిన 55వ వార్డు పార్టీ బూత్ కన్వీనర్ మీసాల వాసుదేవరావు కుటుంబ సభ్యులకు పార్టీ తరపున న్యాయం చేసి ఆదుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, వార్డు ప్రధాన కార్యదర్శి మీసాల సూరి అప్పలనాయుడు చం ద్రబాబు సతీమణి భువనేశ్వరిని కోరారు. తాటిచెట్లపాలెం రామచంద్రానగర్‌కు శుక్రవారం విచ్చేసిన ఆమెకు వినతి పత్రం సమర్పించారు. వాసుదేవరావు మృతి పార్టీ కార్యాలయానికి కొంత ఆలస్యంగా తెలియజేయడంతో ఆ కుటుంబానికి ఎటువంటి సాయం అందలేదని వివరించారు. ఈస్థితిలో స్పందించి ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత పథకంతో పొట్ట కొట్టొద్దు

- ఆటో కార్మికులు ఆందోళన

మహారాణి పేట, జనవరి 5: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం అమలు చేసి తమ పొట్ట కొట్టవద్దని ఆటోడ్రైవర్లు అభ్యర్థించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు వినతి పత్రమిచ్చారు. ఈసందర్భంగా సంఘ నాయకుడు గొలగానినాయుడు మాట్లా డుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాజకీ య స్వలాభం కోసం వివిధ పార్టీలు మ హిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకల్లో మహి ళలకు ఈపథకం అమలు చే యటం తో ఆ రాష్ట్రాల్లో ఆటో కార్మికు లకు వీధినపడ్డారన్నారు. ఈ పరిస్థితి చూసి రాష్ట్రంలో ఆటో కార్మికులు అధైర్య పడుతున్నారన్నారు. ఈ దృష్ట్యా ఉచిత ఆర్టీసీ ప్రయాణం రాకుండా చూడాలని డి మాండ్ చేశారు. నారి రాజనాయుడు జీ రామారావు, నాగుతోపాటుఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఆటోడ్రైవర్లకు యూనిఫారాల పంపిణీ

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పలు వార్డుల్లోని కూడళ్లలో ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు వైసీపీ పాలనపై విసుగుతో ఉన్నారని, ప్రభుత్వం మార్పు కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

సాంకేతిక పరిజ్ఞాన బోధనతో సత్ఫలితాలు

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్
- ఎలమంచిలిలో జోన్ 1 కళాశాలల సమీక్ష సమావేశం

ఎలమంచిలి, జనవరి 5 : కళాశాలల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధన చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చునని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జోన్-1 కళాశాలల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారాన్ని తీసుకొని నాక్ ఏ గ్రేడును సాధించడమే కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి పొందడం గొప్ప విషయమన్నారు. కళాశాల అధ్యాపక బృందాన్ని ఆయన ఈసందర్భంగా అభినందించారు. సమష్టిగా కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్న కళాశాల పరిసరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విభాగాలు, జిమ్ తదితర విభాగాలను బృంద సభ్యులంతా పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పోలా భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన 40 ప్రభుత్వ, 3 ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కళాశాలల అంతర్గత నైపుణ్యాల మదింపు సంస్థల అధికారులు ఏజీఓ తులసి మస్తానమ్మ, జోన్ వన్ ఆర్‌జేడీ శోభా హాజరయ్యారు.



పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

వినియోగదారుల సంఘం అధ్యక్షుడికి అభినందన

అక్కయ్యపాలెం, జనవరి 5 : వినియోగదారులను వారి హక్కులపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడంలో విశాఖ జిల్లాను ఆంధ్రప్రదేశ్‌లో రెండో స్థానంలో నిలపడంపై జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మర్రి సత్యనారాయణను జేసీ కె.విశ్వనాథన్‌ను అభినందించారు. ఈమేరకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



సత్యనారాయణకు ప్రశంసా పత్రం అందిస్తున్న జేసీ విశ్వనాథన్

కలెక్టర్‌తో ఏపీఎన్‌జీవో నాయకుల సమావేశం

మహారాణిపేట, జనవరి 5: ఏపీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు కలెక్టర్ ఏ మల్లికార్జునతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ముందుగా అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కార్యదర్శి కేవీ శివారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు కే ఈశ్వరరావు, నాయకులు ఆర్. రవిశంకర్ , పురుషోత్తమ నాయుడు , డీవీ రమణ , ఆర్‌వీ సత్య నారాయణ, సుబ్రహ్మణ్యం, ఉమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్, జనవరి 5: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలక సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు మొహమ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఈమేరకు పోస్టర్లను కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు ఆవిష్కరించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

సీతమ్మధార, జనవరి 5: స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను శనివారం సాయంత్రం ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆరోలియన్ ఒడిసే పేరిట సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొంటారన్నారు.


41వార్డులో పింఛన్లు పంపిణీ

జ్ఞానాపురం, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ఈనెలనుంచి పెంచిన రూ. వేల సామాజిక పింఛన్లను శుక్రవారం జ్ఞానాపురంలో కార్పొ రేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారని ఈసందర్భంగా అన్నారు. జోన్-5 యూసీడీపీడీలు పద్మావతి, చిరంజీవిలున్నారు.

ఆదాయం రూ.160 కోట్లు, వ్యయం రూ.215 కోట్లు

- ఫిబ్రవరి నాటికి సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పూర్తి
- వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక
- ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం
- వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరు నెలాఖరు వరకు రూ.160 కోట్ల ఆదాయం రాగా, రూ.215 కోట్లు వ్యయం చేశామని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారు. సిరిపురం చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా చేశామని, ఆ మిగిలిన మొత్తాన్ని మార్చి నెలాఖరులోగా సాధిస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. గతంలో కంటే ఇప్పుడు వీఎంఆర్‌డీఏ ఎక్కువ ప్రాజెక్టులు చేస్తున్నదని చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో మొత్తం తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు ప్రతిపాదించగా వాటిలో మూడు పూర్తయ్యాయని, ఇంకో ఆరు నిర్మాణంలో ఉన్నాయన్నారు. సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనాన్ని ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్ఏడీ జంక్షన్‌లో రైలు ఓవర్ బ్రిడ్జి పనులు సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమయ్యాయని, దీనిని సెప్టెంబరులో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. బీచ్‌లో ఓషన్ డెక్, తెన్నేటి పార్కు వద్ద ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నాయన్నారు. కైలాసగిరిపై జిప్ లైనర్, స్కై సైక్లింగ్ వంటివి కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇవి రెండున్నర నెలల్లో పనిచేస్తాయన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కైలాసగిరిపై రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల వ్యయంతో పీపీపీలో నేచురల్ రిసార్ట్స్, రివాల్వింగ్ రెస్టారెంట్ వస్తాయన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక బీచ్ వద్ద ఏడు ఎకరాల స్థలం ఉందని, అందులో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపడతామన్నారు. దీనికి రూ.220 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ దాట్ల కీర్తి, సీఈ శివప్రసాద్‌రాజు, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరిక లేకే.. విశాఖ ఉత్సవ్ నిర్వహించలేదు

ఏటా డిసెంబరులో జరిగే విశాఖ ఉత్సవ్ కోసం నగరవాసులు ఎంతో ఆశగా ఎదురు చూస్తారని, అటువంటి వేడుకను రెండేళ్లుగా ఎందుకు నిర్వహించడం లేదని విలేకరులు కలెక్టర్ వద్ద ప్రస్తావించగా.. తీరిక లేకే నిర్వహించలేకపోయామని సమాధానమిచ్చారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పర్యాటక అభివృద్ధిపై చర్చలో పలువురు విశాఖ ఉత్సవ్ అంశాన్ని లేవనెత్తారు. కరోనా సమయంలో వీలుకాక నిర్వహించలేదని, గత రెండేళ్లుగా అవకాశం ఉన్నా నిర్వహించలేదని దీనికి ప్రత్యేక కారణాలు ఏమీ లేవని కలెక్టర్ స్పష్టంచేశారు.

సుందరంగా మాడవీధులు

సింహాచలం, జనవరి 5 : సింహగిరిపై ఉన్న ప్రధాన మాడవీధులకు మరిన్ని మెరుగులు దిద్దుతున్నారు. నగరానికి చెందిన ఎస్‌ఏఎంఎస్ చారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఆకుల జయలక్ష్మీ సారథ్యంలో ఈ పనులు చేపడుతున్నారు. ట్రస్టుకు చెందిన వివిధ రాష్ట్రాల మహిళలు స్వచ్ఛందంగా సింహగిరికి చేరుకుని రెండు రోజులుగా దేవస్థానం అందజేసిన రంగులతో ప్రధాన రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో రంగవల్లికలు అద్దే పనులు చేపడుతున్నారు.

అడివివరం సొసైటీ మహాజన సభ రేపు

సింహాచలం, జనవరి 5 : అడివివరం సహకార పరపతి సంఘం మహాజన సభ ఈనెల 7న జరగనున్నట్టు పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 9.45 గంటలకు స్థానిక స్వామి కల్యాణ మండపం ఆవరణలో ఈ సభ జరుగుతుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి సభ్యుల షేర్ ధనం వాటా పంపిణీ, త్రిష్ట డిపాజిట్లపై వడ్డీ చెల్లింపు,తదితర అంశాలపై చర్చించ నున్నట్టు ఆయన చెప్పారు.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర

సిరిపురం, జనవరి 5 : మున్సిపల్ కార్మికుల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పి.సుబ్బారాయుడు ఆరోపించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న కార్మికుల దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆయనతో పాటు నాయకులు కె. సత్యనారాయణ, ప్రకాష్, దుర్గారావు, వెంకటేష్, శివ, కిషోర్ ఉన్నారు.

వీధి లైట్లు వెలగక అవస్థలు

సాగర్‌నగర్, జనవరి 5 : జీవీఎంసీ 8వ వార్డు సాగర్ నగర్ కాలనీలో పలుచోట్ల వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంజీడీ పార్కు, ఎంఐజీ డి, ఎల్ఐజీ సి మధ్య ఉన్న రహదారిలో లైట్లు వెలగకపోవడంతో ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.నెలలు తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. కొన్నిచోట్ల లైట్లు వెలుగుతున్నా చెట్ల కొమ్మలు అడ్డు రావడంతో వాటి వెలుతురు రోడ్లపై పడక ఆయా ప్రాంతాల్లో చీకటి నెలకొంటోంది. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా విరాట్ - 2024

మధురవాడ, జనవరి 5 : మధురవాడ సిమ్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం విరాట్-2024 ఉత్సాహంగా సాగింది. సీఎంటీ, సిమ్స్ కళాశాలల విద్యార్థులు రెండు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.ఈ వేడుకలో 30 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలిరోజు నాలుగు లా ఈవెంట్లు, నాలుగు మేనేజ్‌మెంట్ ఈవెంట్లు నిర్వహించారు. అనంతరం పలు కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మద్దిలపాలెం, జనవరి 5 : కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సీహెచ్ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో కోర్సులో 30 మందికి శిక్షణ ఇస్తామని,ఆసక్తి గల వారు ఈనెల 8వ తేదీలోపు పిఠాపురం కాలనీలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8500054456 నంబర్‌లో సంప్రతించాలని సూచించారు.

కొట్లాటలో మహిళకు గాయాలు

ఆరిలోవ, జనవరి 5 : పెదగదిలిలోని సాలిపేటలో స్థల వివాదమై ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సాలిపేటలో 60 గజాల స్థల వివాదం కోర్టులో ఉంది. స్థలం తనదంటూ నరసింగరావు అనే వ్యక్తి గురువారం సాయంత్రం అక్కడికి వెళ్లి రాజాన కామేశ్వరితో తగాదా పడ్డాడు. ఇది ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ సంఘటనలో కామేశ్వరికి గాయాలు కావడంతో కేజీహెచ్‌కి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పట్ల పంపిణీ

సింహాచలం, జనవరి 5 : విజినిగిరిపాలెంలో సామాజిక కార్యకర్త విజినిగిరి బాలభానుమూర్తి పేదలకు శుక్రవారం దుప్పట్ల పంపిణీ చేశారు. శీతాకాలం కావడంతో పేదలకు రక్షణగా వీటిని అందజేసినట్టు ఆయన తెలిపారు.

సినిమా గైడ్

● **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **పిండం :** మోహిని (గాజువాక)
● **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 46, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 20, క్యారేట్ 46, దొండకాయలు 34, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 105, బరబటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 36 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 50, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 70
ఫారం ధర	-- 90
విత్ స్కిన్	-- 150
స్కిన్‌లెస్	-- 160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

డంపింగ్ యార్డుల్లా వీధులు


పెదజాలరిపేటలో పేరుకుపోయిన చెత్త కుప్ప

పారిశుధ్య కార్మికుల సమ్మెతో వీధుల్లో చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడం వల్ల విపరీతమైన దుర్వాసన వెలువడడంతో పాటు దోమలు, ఈగల వ్యాప్తితో వ్యాధుల భయం పొంచి ఉంది. ఆరిలోవలోని ఏ వార్డులో చూసినా.. భయానక పరిస్థితులు కనిపిస్తున్నాయి.రాత్రి సమయంలో ప్రత్యేక సిబ్బందితో చెత్త తొలగిస్తున్నట్టు జీవీఎంసీ అధికారులు చెబుతున్నా.. అందులో వాస్తవం ఉండడం లేదు. మేయర్ హరి వెంకట కుమారి సొంత వార్డులోనే ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ఉంటే మిగతా చోట్ల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

- ఆరిలోవ/పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి


ఆరిలోవలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలు


తోటగరువు ఉన్నత పాఠశాల సమీపంలో చెత్త


ఆదర్శనగర్‌లో చెత్తతో నిండిపోయిన డస్ట్ బిన్లు

మునిసిపల్ కార్మికుల వినూత్న నిరసన

కొమ్మాది, జనవరి 5 : సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు శుక్రవారం జోన్-2 కార్యాలయం ఎదుట పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సీహెచ్ శేషుబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎంత నిర్బంధించినా ప్రజా మద్దతుతో ఎదుర్కొంటామన్నారు. సమ్మెపై అధికారులు ఉక్కుపాదం మోపుతూ దౌర్జన్యం చేయడం దుర్మార్గమని చెప్పారు. ప్రభుత్వం ప్రజలను, కార్మికులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, సీఐటీయూ జోన్ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు, నాయకులు బి. రత్నం, నరసింగరావు, కె. అచ్చియమ్మ, బి. దుర్గ, రాజు పాల్గొన్నారు.


జోన్-2 కార్యాలయం వద్ద పొర్లుదండాలు పెడుతున్న కార్మికులు

ఎమ్మెల్యేకు వినతి

మధురవాడ : వాంబేకాలనీలో మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. కాలనీలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు కార్మిక సంఘం ప్రతినిధులు కలిసి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కాగా నగరంపాలెంలో కార్మికులు డంపర్ వాహనాలను అడ్డుకొని నిరసన తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

భీమునిపట్నం, జనవరి 5 : ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ భీమిలి ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు కె. వెంకటలక్ష్మి అన్నారు. సమ్మెలో భాగంగా శుక్రవారం వారు భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనాన్ని రూ. 26 వేలుకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కె. పద్మావతి, భీమిలి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు, ఆయాలు


టీడీపీ మినీ మేనిఫెస్టో పత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యం : ఎమ్మెల్యే

ఆరిలోవ, జనవరి 5 : ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం 11వ వార్డులోని అన్నానగర్, స్వామి వివేకానందనగర్, బాలాజీనగర్, ప్రియదర్శిని కాలనీలో టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగపూడి ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు.వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాగోతి అచ్చుతరావు. వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, జనసేన అధ్యక్షుడు సరిపల్లి రాము, విక్రమ్, కృష్ణంరాజు, మూది అప్పారావు, ఆదినారాయణరావు, చందక లలిత, సత్యవతి, మజ్జి లక్ష్మి, రేఖా జ్యోతి పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో ...

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో టీడీపీ నాయకులు శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 91, 93 బూత్ ఇన్‌చార్జిలు గరికిన నూకరాజు, మైలపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చర్యలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 5 : గుడివాడ పంచాయతీ శ్రీరాంనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దివీస్ యాజమాన్యం రూ 1. 04 లక్షలతో థీమ్ పెయింటింగ్ వేయించింది. వీటిని దివీస్ సామాజిక సేవా విభాగం అధికారి డి. సురేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అవసరమైన వివిధ అంశాలను చిత్రాల రూపంలో గోడలకు వేయించామని, ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో దివీస్ అధికారులు శ్రీనివాసరావు, శేఖర్, ఉపాధ్యాయుడు జనార్దనరావు పాల్గొన్నారు.

నగరపాలెంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ


పూజలు అనంతరం అక్షింతలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మహిళలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 5 : నగరపాలెంలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటికి పంపిణీ చేశారు. మూడు రోజుల క్రితం వచ్చిన అక్షింతలకు కాశీ విశ్వేశ్వరాలయంలో పూజలు జరిగిన అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటింటికి పంపిణీ చేశారు.

ముగిసిన శారదా మణిదేవి జయంత్యుత్సవం

భీమునిపట్నం, జనవరి 5 : పట్టణంలోని శారదా రామకృష్ణ సంఘంలో మూడు రోజులుగా జరుగుతున్న శారదా మణిదేవి జయంత్యుత్సవాలు శుక్రవారంతో ముగిసాయి.చివరి రోజు లక్ష కుంకుమార్చన చేశారు. సాయంత్రం నగరానికి చెందిన విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ బృందంతో భక్తి సంగీత కచేరీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో శారదేశ్వరానంద పురి, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, పాల్గొన్నారు.

300 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

పద్మనాభం, జనవరి 5 : అయినాడలో శుక్రవారం 300 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి పశు వైద్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఈ టీకాలు వేశామ న్నారు. గ్రామాల్లో ఈనెల 31 వరకు ఈ టీకాలు వేస్తామని చెప్పారు.


తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న కోరాడ రాజబాబు

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలని వినతి

ఆనందపురం, జనవరి 5 : మండలంలోని వేములవలస పంచాయతీలో అర్హత కలిగిన వారికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ భీమిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు తహసీల్దార్ రామారావును కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇళ్ల పట్టాలు మం జూరు చేయగా నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. వేములవలసలో అందుకు విరుద్ధంగా కొంత మంది స్వలాభం కొరకు కోర్టులను ఆశ్రయించి, పట్టాలివ్వకుండా చేయడంతో అర్హత కలిగిన ఎంతోమంది నిరుపేదలు ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పంచాయతీలో గ్రామసభ నిర్వహించి అర్హులందరికీ పట్టాలివ్వాలని కోరారు.

పథకాలపై అవగాహనకే 'వికసిత్ భారత్'

పద్మనాభం (రూరల్), జనవరి 5 : కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టినట్టు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొండ్రంగి, మునివానిపాలెం, సామయ్యవలస గ్రామాల్లో జరిగిన వికసిత్ భారత్ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ప్రజ లకు నిశితంగా తెలియజేయాలన్నారు. అనంతరం ప్రధాని మోదీ ఫొటోతో ముద్రించిన క్యాలెండర్లు, తొమ్మిదేళ్ల బీజేపీ పాలనపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహంతి అప్పల రమణ (శ్రీను), రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పేర్రాజు, సారిక ప్రకాశ్ పాల్గొన్నారు.

తీరంలో పెరిగిన చలి తీవ్రత

సాగర్‌నగర్, జనవరి 5 : సాగర్‌నగర్,రుషికొండ తదితర తీర ప్రాంత గ్రామాల్లో చలి తీవ్రత పెరిగింది. దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ఉదయం 11 గంటల వరకూ సూర్యుడు కనిపించడం లేదు. వేకువజామున వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చలి వల్ల చిన్నారులు, వృద్ధులు జలుబు, జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బైండోవర్ కేసులు నమోదు

పద్మనాభం (రూరల్), జనవరి 5 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని సీఐ కె.సన్యాశినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన పద్మనాభంలో విలేకరులతో మాట్లాడారు.ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే గతంలో కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. రాత్రి పూట గస్తీ ముమ్మరం చేశామని పద్మనాభం, చిన్నాపురం, అనంతవరం, రేవిడి, అయినాడ జంక్షన్లలో తనిఖీలు చేస్తున్నామని చెప్పారు.

నేడు అవంతిలో గ్రాడ్యుయేషన్ డే

తగరపువలస, జనవరి 5 : తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్టు కళాశాల ఛైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యా ణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతు వు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 8 లక్షలు

సింహాచలం, జనవరి 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు కప్ప స్తంభం ద్వారా రూ. 8 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం రికార్డుల ప్రకారం గత నెలలో రూ. 25 టికెట్లు చెల్లించి 32,300 మంది భక్తులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకోవడం ద్వారా మొత్తం రూ. 8,07,500 ఆదాయం లభించింది.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీజీ విందా

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

ఆనందపురం, జనవరి 5 : మండలంలోని పెద్దిపాలెం సమీపంలోని చెన్నా కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం వైజాగ్ ఫొటోఫినా ది ఫొటో, వీడియో ఇమేజింగ్ ఎక్స్ పో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని టాలీవుడ్ ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీజీ విందా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటోగ్రఫీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని చెప్పారు. వాటిన్నింటిని ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఇటువంటి ఎక్స్‌పోలు దోహదపడతాయని తెలిపారు. విశాఖ జిల్లా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ మధు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు ఇప్పలపల్లి రమేష్, బాలు ఇమేజెష్ వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బాలు, తదితరులు పాల్గొన్నారు.

'వాల్మీకిలు అంటే వైసీపీకి చిన్నచూపు'


విలేకరుల సమావేశంలో పాల్గొన్న వాల్మీకి సంఘం నేతలు

ఎంవీపీ కాలనీ, జనవరి 5 : ఏజెన్సీలో ఆదివాసీ వాల్మీకి కులస్తులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదని ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకిలు అంటే వైసీపీకి చిన్నచూపు ఉందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తల నియామకం తమను తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పారు. ఏజెన్సీలో ఉన్న బలమైన సామాజిక వర్గాలు భగత, వాల్మీకి, కొండదొరలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు చింతపల్లి నుంచి దేవూరి కొండలరావు, కోరాబు వెంకటరత్నం, పసుపులేటి బాలరాజు గెలుపొందారని, అరకు నుంచి దుక్కు, సర్వేశ్వరరావు, శెట్టి ఫాల్గుణ ఎన్నికయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఎస్టీల ముసుగులో కొందరు బినామీ ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు రామారావు, సత్యారావు, రామలింగం, పాపారావు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు


చంద్రబాబును కలిసిన గురునాథ్, తదితరులు

కొమ్మాది, జనవరి 5 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్ ఆధర్యంలో ఆరో వార్డు నాయకులు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి సత్యనారాయణ, కె. రామకృష్ణ, కొల్లు బాబీ, కొరగంజి సూరిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణుల కోసం 17 పథకాలు అమలు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సింగ్


సింగనబందలో లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న అధికారులు

భీమునిపట్నం(రూరల్), జనవరి 5 : కేంద్ర ప్రభుత్వం గ్రామీణుల స్వయం ఉపాధి కోసం 17 పథకాలను అమలు చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కేఎం సింగ్ అన్నారు.శుక్రవారం ఆయన సింగనబంద, నారాయణరాజుపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అర్హులై ఉండి పథకాలు అందకపోతే అధికారులను సంప్రతించాలని చెప్పారు. అనంతరం డిప్యూటీ కార్యదర్శి ఎస్ఎస్ మిశ్రాతో కలిసి ఆయా గ్రామాల్లో పీఎం ఎంప్లాయిమెంటు జనరేషన్ ప్రోగ్రాం కింద 35 శాతం రాయితీతో రెండు ఆటోలను, కార్పెంటర్ గేజ్ మిషన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానకి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, ఎంపీపీ సూర్యనారాయణరాజు జెడ్‌పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచులు నారాయణ, సూర్యనారాయణ, తుపాలకుల పైడిరాజు, మజ్జి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వైఎస్సార్ కడప జిల్లా అసిస్టెంట్ కలెక్టర్

సింహాచలం, జనవరి 5 : వరాహలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఉదయం వైఎస్సార్ కడప జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ భ్రమరాంబఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా,అధికారులు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.


మౌర్య భరద్వాజ్ దంపతులు

ప్రసాద్ పథకం పనులు పరిశీలన

సింహాచలం, జనవరి 5 : సింహగిరిపై ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈఓ శ్రీనివాసమూర్తి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆలయ క్షేత్ర పాలకుడు త్రిపురాంతకస్వామి సన్నిధికి ఎదురుగా చేపట్టిన క్యూ కాంప్లెక్స్, బస్టాండ్‌లో జరుగుతున్న మల్టీపర్పస్ షాపింగ్ కాంప్లెక్, గజపతి సత్రం పైభాగంలో చేపడుతున్న వసతి గృహం నిర్మాణాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరాజు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎండాడ, జనవరి 5 : ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం దృష్టిసారించిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 8వ వార్డు రాజీవ్‌నగర్ ప్రాంతంలో రూ. 75 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే ఎండాడ బీసీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మీ, కార్పొరేటర్ నొడగల అప్పారావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివారావు